సాక్షి మంచిర్యాల

గురువారం । 15 । ఆగస్టు । 2024

I



మెడికోలకు భద్రతెంత..?

ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుండా పోతోంది. మెడికోలు, సీనియర్ రెసిడెంట్లకు భద్రత కరువైంది. ఉమ్మడి జిల్లాలోని మెడికల్ కాలేజీల్లో భద్రతపై కథనం. IIలో ▸

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన ఎమ్మెల్యే పీఎస్సార్



సీఎంతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి స్వదేశానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి రాష్ట్రాభివృద్ధి కోసం పలు కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

పోలీస్ వాహనాలు సొంతానికి ఉపయోగిస్తే చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: పోలీసు వాహనాలను సొంతానికి వినియోగిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని మంచిర్యాల డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక డీసీపీ కార్యాలయంలో జిల్లాలోని పోలీసుస్టేషన్లలో పోలీసు అధికారులు వినియోగించే వాహనాలను పరిశీలించారు. వాహనాల పనితీరుపై డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు తక్షణ సేవలు అందించేందుకు ప్రభుత్వం అధునాతనమైన వాహనాలు అందజేసిందని తెలిపారు. విధి నిర్వహణలో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఎంటీవో సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ కొనుగోలుకు రశీదు ఇవ్వాలి



స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి కల్పన

బెల్లంపల్లి: ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసిన ప్రతీ ఒక్కరికి రశీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన వ్యాపారులకు సూచించారు. బుధవారం బెల్లంపల్లిలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టించవద్దని అన్నారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, తెల్లకాగితాలపై బిల్లులు రాసి ఇవ్వవద్దని అన్నారు. అక్కడక్కడ ఆ తీరుగా బిల్లులు ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఆ విధానాన్ని మానుకోవాలని, లేనిపక్షంలో లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారికి పంపించాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పర్యావరణంపై అవగాహన సదస్సు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ కళాశాలలో గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పర్యావరణంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రముఖ అంతర్జాతీయ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాగర్ ధార హాజరై ప్రసంగిస్తారు. పర్యావరణ సమస్యలు, వాటి పర్యవసానాలు, పరిష్కార మార్గాలపై ఉపన్యాసం ఉంటుందని స్నేహ ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు.

మంచిర్యాలలో స్మారక దినం

మంచిర్యాలటౌన్: దేశ విభజన గాయాల స్మారక దినం సందర్భంగా మంచిర్యాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ ఆనాడు దేశ విభజన అశాస్త్రీయంగా చేయడం వల్లనే అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యాయని అన్నారు. అనేక మంది ప్రజలు తమ కుటుంబాలను కోల్పోయారని తెలిపారు. ఆనాటి దేశ విభజన విధానాన్ని వ్యతిరేకిస్తూ స్మారకదినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దుర్గం అశోక్, గోలి రాము, కర్రె లచ్చన్న, ఎనగందుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

హాస్టళ్లలో అలర్ట్..!

- మెనూ అమలుపై దృష్టి
- దిద్దుబాటు చర్యల్లో వార్డెన్లు, టీచర్లు
- ఎఫ్ఆర్ఎస్ అమలుతో లెక్క పక్కాగా



జిల్లా కేంద్రంలోని ఎస్టీ వసతిగృహం వద్ద వార్డెన్ కారు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, వసతితో కూడిన విద్యాలయాల్లో ఏసీబీల తనిఖీలతో అప్రమత్తం అయ్యారు. మంగళవారం వేమనపల్లి మండలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టి అవకతవకలు గుర్తించిన విషయం తెలిసిందే. నిన్న మొన్నటి వరకు ఏదో పని పేరిట ఎగనామం పెట్టే వార్డెన్లు, టీచర్లు నిర్ణీత సమయానికంటే ముందే విధులకు హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఏ విద్యాసంస్థల్లో తనిఖీలు చేస్తారో తెలియకపోవడంతో రికార్డులు సరి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఒక్కసారైన మెనూ పాటించని వార్డెన్లు సక్రమంగా అమలు చేయడంతో విద్యార్థులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు తనిఖీ చేస్తున్నప్పటికీ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ అంతంత మాత్రమే కావడంతో ఇష్టానుసారంగా నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారుల తనిఖీలు గుబులు పుట్టిస్తున్నాయి.

పర్యవేక్షణ గాలికి..

వసతిగృహాల్లో పర్యవేక్షణ కొరవడడంతో ఇష్టారాజ్యం సాగుతోంది. సరుకుల సరఫరా నుంచి కూరగాయల కొనుగోలు వరకు ఏం జరుగుతుందో తెలియకుండా పోతోంది. నాణ్యమైన బ్రాండ్ల పేరిట ఏదో ఒక సరుకులు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కొన్ని వసతిగృహాల్లో సరుకులు టెండర్‌దారులు సరఫరా చేస్తుండగా కూరగాయలు, పండ్లు, గుడ్లు మాత్రం వార్డెన్లు కొనుగోలు చేస్తున్నారు. మెనూ పాటించకుండా మార్కెట్‌లో ఏది తక్కువ ధరకు లభిస్తే ఆ కూరగాయలు కొసరి కొసరి తెస్తూ విద్యార్థులకు సరిపడా వడ్డించడం లేదని తెలుస్తోంది. కూరగాయలు, కోడిగుడ్లు, పండ్లలో మిగులుబాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాలకు బదులు టెట్రా ప్యాకెట్లు వాడిన సందర్భాలు లేకపోలేదు. అర లీటర్ ప్యాకెట్‌తో 30మంది విద్యార్థులకు చాయ్ చేస్తున్న విషయం 'సాక్షి' కంటపడడంతో అక్కడ వంట మనిషి సర్దిచెప్పేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. జిల్లా కేంద్రంలోనే మరో వసతిగృహంలో ఓ వార్డెన్ లోకల్ అంటూ వసతిగృహానికి ఎవరు వెళ్లినా దురుసుగా వ్యవహరిస్తుంటారని తెలుస్తోంది. వార్డెన్ ఎక్కడా అని ఎవరైనా అడిగితే మా సార్‌కు ఏదో పని ఉంటుందని సమాధానం చెప్పడం అక్కడి సిబ్బందికి పరిపాటి. ఏసీబీ తనిఖీలతో బుధవారం వార్డెన్ పొద్దంతా విధుల్లో ఉండడం గమనార్హం.

విద్యార్థుల లెక్కపై గందరగోళం..

ఆశ్రమ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల లెక్క గందరగోళంగా మారుతోంది. ఏసీబీ తనిఖీల్లో హాజరు పట్టిక, తరగతి గదుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యలో వ్యత్యాసం తేలడం చూస్తే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. బయోమెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) యాప్ అటెండెన్స్ విధానం విద్యార్థులకు అమలు చేయకపోవడంతో ఎవరి ఇష్టం వారిదే అన్నట్లుగా మారింది. డీఈవో పరిధిలోని మోడల్ స్కూల్, కేజీబీవీ, పాఠశాలల్లో నిత్యం ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం(ఎఫ్ఆర్ఎస్) అమలు చేయడంతో విద్యార్థుల లెక్క పక్కాగా తేలుతోంది. ముఖ గుర్తింపు హాజరు ద్వారా విద్యార్థుల సంఖ్య మధ్యాహ్న భోజన సమయంలో హాజరు, లెర్నింగ్ యాక్టివిటీస్ వంటివి ఇట్టే తెలిసిపోతోంది. ఎస్టీ హాస్టల్‌లో ఈ విధానం అమలు చేస్తుండగా ఇంకా 20 నుంచి 30శాతం మాత్రమే విద్యార్థులను యాప్‌లో నమోదు చేసినట్లు తెలుస్తోంది. బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో ఈ విధానం అమలుపై సందిగ్ధత నెలకొంది. వార్డెన్లు, టీచర్లకు కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేస్తే విధుల డుమ్మాకు చెక్ పడనుంది.

వసతిగృహాలు ఇలా..

జిల్లాలో ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు 16, రెండు పోస్టు మెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో 3,240 మంది విద్యార్థులు ఉన్నారు. 23 ఎస్సీ ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్‌లో 2,430 మంది విద్యార్థులు వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్నారు. బీసీ వసతిగృహాలు పోస్టుమెట్రిక్ 8(897 మంది విద్యార్థులు), ప్రీమెట్రిక్ 8(748 మంది విద్యార్థులు)లో వసతి పొందుతూ ఆయా విద్యాసంస్థల్లో చదువుతున్నారు. ప్రీమెట్రిక్(3 నుంచి 7వ తరగతి)లో విద్యార్థికి రూ. 950, హైస్కూల్ విద్యార్థుల(8 నుంచి 10వ తరగతి)కు రూ.1100, పోస్టు మెట్రిక్(కళాశాల) విద్యార్థికి రూ.1,500 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎస్టీ వసతిగృహంలో కిచెన్ షెడ్డు ఉరుస్తుండడంతో భోజనం వండే క్రమంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దండేపల్లి ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. లక్సెట్టిపేట ఎస్సీ హాస్టల్ పరిస్థితి అధ్వానంగా మారింది. జైపూర్‌లో ఎస్సీ బాలుర వసతిగృహంలో భయం భయంగా విద్యార్థులు గడపాల్సి వస్తోంది. చాలా చోట్ల నీటి నిర్వహణ లేకపోవడంతో మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంటు చెడిపోయి మరమ్మతులకు నోచుకోకపోవడంతో విద్యార్థులు నల్లా, బోర్‌వెల్ నీటిని తాగుతుండడంతో ఎ ప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

పంద్రాగస్టు వేడుకలకు సిద్ధం



కలెక్టరేట్ భవన సముదాయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక

నస్పూర్: 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నిర్వహించే వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఉదయం 10గంటలకు జెండావిష్కరణ అనంతరం గౌరవ వందనం స్వీకరిస్తారు. ముఖ్య అతిథి సందేశం, సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, ప్రశంసాపత్రాల పంపిణీ, స్టాల్స్ సందర్శన, వందన సమర్పణ కార్యక్రమాలు ఉంటాయి. ఆయా కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక సిద్ధం చేశారు. ఏర్పాట్లను కలెక్టర్ కుమార్ దీపక్ ఆర్డీవో రాములు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నిత్య జనగణమన



జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్(ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో నిత్య జనగణమన గీతాలాపన జరుగుతోంది. ప్రజల్లో దేశభక్తి, సమైక్యత భావాన్ని పెంపొందించి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన దేశభక్తుల త్యాగనిరతిని గుర్తుపెట్టుకోవాలనే ఉద్దేశంతో ఈ ఏడాది జనవరి 26న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమం 200 రోజులు పూర్తి చేసుకుంది. రోజువారీగా ఉదయం 8గంటలకు వన్‌టౌన్ నుంచి జనగణమన గీతాలాపన ఆపరేటింగ్ చేస్తుండగా, జనగణమన గీతం మైక్‌లో రాగానే కాంటా చౌరస్తా, సర్దార్ భగత్‌సింగ్ చౌరస్తా(రామా టాకీసు ముందు), తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా(పాత బస్టాండ్) ముఖ్య కూడళ్ల వద్ద పురప్రజలు ఎక్కడికక్కడ నిలబడి సెల్యూట్ చేస్తూ జాతీయగీతాన్ని ఆలపిస్తారు. ఈ కార్యక్రమం విజయవంతానికి జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడేపు సతీష్, బాధ్యులు, ప్రజా సంఘాల శ్రేణులు నిరంతరం శ్రమిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నస్పూర్: వానాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. బుధవారం ఆమె హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విషజ్వరాల నియంత్రణపై అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. జిల్లా, డివిజన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో రాపిడ్ రెస్పాన్స్ బృందాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిరంతరం కొనసాగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలని, నాటిన మొక్కలకు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్, విషజ్వరాల నివారణకు గ్రామాలు, మున్సిపాలిటీలలో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యాధుల నియంత్రణకు ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. దోమల వృద్ధిని అరికట్టడానికి బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటివి క్రమం తప్పకుండా చేయాలని తెలిపారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు.

పేరు మార్పిడికి డబ్బులు తీసుకున్న ఇద్దరి అరెస్టు

మంచిర్యాలక్రైం: స్థానిక మున్సిపాల్టీలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తూ అనారోగ్యానికి గురై, వయస్సు పైబడిన వారి పేర్లపై వారి కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరు మార్పించేందుకు లంచం తీసుకున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడిగా పని చేసిన సుధమల్ల హరికృష్ణ, అదే సంఘానికి జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన మడుగుల నవీన్‌లు పేర్లు మార్పించడానికి ఎనిమిది మంది నుంచి రూ.4.40 లక్షలు వసూలు చేశారని తెలిపారు. ఇద్దరు కలిసి పంచుకున్నారని పేర్కొన్నారు. ఏడాది గడిచినా పేర్లు రికార్డులోకి ఎక్కించకపోవడంతో బాధితులు నందనగిరి సామ్యేల్, సంద రాజేష్, రాయల అరణ్‌కుమార్, దామెర సుధాకర్, పల్లెపు ప్రదీప్, సుందిళ్ల మధూకర్, చిప్పకుర్తి తిరుపతి, పొనూరి పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 60శాతం మంది బీసీలు ఉన్నా మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమని అన్నారు. బీసీలను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడానికి, బీసీ మంత్రిత్వ ఏర్పాటు చేసి మంత్రులు, సహాయ మంత్రులను నియమించాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు శ్రీపతి రాములు, ఎస్.భీంసేన్, కే.శ్రీనివాస్, అంకం సతీష్, తన్నీరు భీంరావు పాల్గొన్నా రు.

రోగులకు వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ



మంచిర్యాలలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండగా.. ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి పెరుగుతోందని, వారికి ఇబ్బందులు లేకుండా వైద్యం అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫ్యాన్లు లేవని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్యలను రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని మందులు అందుబాటులో లేవని, ఆస్పత్రిలో దుర్వాసన వస్తుందని వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోందని, అందుకు తగినట్లు వైద్యులు సేవలు అందించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా జ్వరం కేసులు ఎక్కువగా వస్తున్నాయని, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఓపీ ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ప్రత్యేక వైద్యుడిని నియమించి మందుల కొరత లేకుండా చూస్తున్నామని, అవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఆస్పత్రి ఆవరణలో చెత్త వేయొద్దని, వేసిన చెత్తను వెంటనే తొలగించేలా చూడాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రరెడ్డిని ఆదేశించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

లక్సెట్టిపేట: ఆస్పత్రికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డులు, ల్యాబ్, ఫార్మసి, రిజిష్టర్లు పరిశీలించారు. అనంతరం రోగులకు అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు.

స్వాతంత్య్ర దినోత్సవం పండుగలా జరుపుకోవాలి



ర్యాలీలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని ప్రజలందరూ పండుగలా జరుపుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. హర్ ఘర్ తిరంగ ర్యాలీలో భాగంగా బుధవారం మంచిర్యాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా, రైల్వేస్టేషన్ రోడ్డు, ముఖరం చౌరస్తా, శ్రీనివాస్ థియేటర్, ఫ్లైఓవర్‌బ్రిడ్జి వరకు జాతీయ జెండాలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా తిరంగ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిలిశెట్టి అశ్విన్, గోలి రాము, అమిరిశెట్టి రాజు, పల్లి రాకేశ్, బింగి ప్రవీణ్, జోగుల శ్రీదేవి, రెడ్డిమల్ల అశోక్, ఆరెందుల శ్రీనివాస్, సుజిత్, తిరుమల, చిరంజీవి, ఆర్నకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బంద్ విజయవంతం



మంచిర్యాల పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు

మంచిర్యాలటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులు, అరాచకాలను ఖండిస్తూ బుధవారం జిల్లాలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. మంచిర్యాల పట్టణంలో హిందూ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు బంద్ ప్రశాంతంగా సాగింది. అన్ని దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసి ఉంచగా, కార్పొరేట్ స్థాయి వ్యాపార వాణిజ్య సముదాయాలను మూసివేశారు. ఐబీ చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా, బస్టాండ్, పోలీసుస్టేషన్ ఏరియా నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా ముఖరం చౌరస్తా, ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు డేగ రవీందర్, కార్యదర్శి కర్ణకంటి రవీందర్, వెంకట్‌రెడ్డి, తుల మధుసూదన్, మల్లారెడ్డి, బోయిని హరికృష్ణ, సత్యారెడ్డి, శ్రీనివాస్, సందీప్, అమర్‌నాథ్‌గౌడ్, సంజీవ్, రమేశ్ పాల్గొన్నారు.



హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంచిర్యాలలో ర్యాలీ

మహిళా సంఘాలపై స్టీల్ బ్యాంకు నష్టాలు

- మెప్మా సిబ్బంది నిర్వాకం
- సభ్యుల నుంచి వసూలుకు తీర్మానం
- సంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత



స్టీల్ బ్యాంకులోని స్టీల్ పాత్రలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంకు నష్టాల పేరిట డబ్బుల వసూలుకు రంగం సిద్ధమైంది. మహిళా సంఘాల్లోని సభ్యులు నుంచి డబ్బుల వసూలుకు తీర్మానించడంపై తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ప్లాస్టిక్ నివారణకు ప్రత్యామ్నాయంగా స్టీల్ వస్తువులు వినియోగించాలనే ఉద్దేశంతో గత ఏడాది సెప్టెంబర్ 23న స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇందుకోసం మహిళా సంఘాలకు రూ.5లక్షల రుణం అందజేసి శుభకార్యాల్లో ఒకేసారి వెయ్యి మందికి సరిపోయేలా 20 రకాల స్టీలు పాత్రలు అద్దెకు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. బయటి మార్కెట్‌లో కంటే తక్కువ ధరకు అద్దెకు ఇస్తారు. మెప్మా టీఎల్ఎఫ్ అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఫంక్షన్‌హాల్లో ప్లాస్టిక్‌ను వినియోగించవద్దనే నిబంధనలు అమలు చేయకపోవడంతో స్టీల్ సామగ్రిని అద్దెకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇళ్లల్లో జరిగే శుభకార్యాలకు స్టీల్ పాత్రలను తక్కువ ధరకే అద్దెకు అందించే అవకాశం ఉన్నా ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం, ప్లాస్టిక్ నియంత్రణపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. వీటి నిర్వహణతోనే మహిళా సంఘాల పెట్టుబడి రూ.5 లక్షలు, నెలనెలా ఆదాయం రావాల్సి ఉండగా, నిర్వహణ లేక ఏడాదిగా నష్టాల పాలైంది. రుణం చెల్లించలేని పరిస్థితి రావడంతో మెప్మా అధికారులు 1250 మహిళా సంఘాల్లోని సభ్యులు దాదాపుగా 12,500 మంది ఒక్కొక్కరు రూ.60 చెల్లించాలంటూ తీర్మానం చేశారు. ఈ లెక్కన రూ.7.50లక్షలు వసూలు అవుతుంది. రూ.5 లక్షల పెట్టుబడితో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకుకు రూ.7.50 లక్షలు వసూలుపై మహిళా సంఘాల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నిర్ణయంపై మెప్మాలోని 70 శాతానికి పైగా మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా గ్రూపులకు రావాల్సిన రుణాలు ఇవ్వబోమని మెప్మా అధికారులు బెదిరిస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. మెప్మాలో అధికారులు, టీఎల్ఎఫ్ అధ్యక్షుల ఇష్టారాజ్యంతోనే ఇలా జరుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

మెడికోలకు భద్రతెంత?

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలటౌన్: 'వైద్యో నారాయణో హరి' అంటే.. వైద్యుడు దేవునితో సమానమని అర్థం. కళ్లెదుట కనిపించే వైద్యుడినే ఆపదలో ఉన్నవారు దేవునిగా భావిస్తారు. కానీ ఎంతో మంది ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేకుండా పోతోంది. ఇటీవల కోల్‌కతాలో ఓ వైద్య విద్యార్థిపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన తెలిసిందే. దీంతో దేశ వ్యాప్తంగా వైద్య విద్యార్థులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో రిమ్స్‌లో ఓ పీజీ వైద్యురాలిపై గైనిక్ డిపార్ట్‌మెంట్‌లో మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ దాడికి పాల్పడింది. ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కాగా రిమ్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కొంతమంది ధ్వంసం చేయడం, అందులో వీడియో రికార్డు కాకుండా పక్కకు నెట్టేయడం వంటివి చేస్తున్నారు. దీంతో రిమ్స్‌లో మెడికోలకు భద్రత ఎంత? అనే ప్రశ్న తలెత్తుతోంది.

- రిమ్స్‌లో తరచూ చోటు చేసుకుంటున్న ఘటనలు
- నిఘానేత్రాలు ఉన్నా.. పనిచేయని వైనం
- వైద్య విద్యార్థులపై బయటి వ్యక్తుల దాడి
- ఇటీవల కూడా ఓ పీజీ వైద్యురాలిపై..



కోల్‌కతా ఘటనకు సంబంధించి రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మెడికోలు

రిమ్స్‌లో రక్షణ కరువు

రిమ్స్‌లో మెడికోలతో పాటు సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులు వసతిగృహంలో ఉంటూ చదువుతో పాటు సేవలు అందిస్తున్నారు. రెగ్యులర్ వైద్యులు అందుబాటులో లేనప్పటికీ వీరే అన్నీతామై రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే మెడికోలకు మాత్రం రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అర్ధరాత్రి కొంత మంది బయటి వ్యక్తులు వసతిగృహంలోకి చొరబడి మెడికోలపై దాడికి దిగారు. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ ఘటనకు సంబంధించి వ్యక్తులను గుర్తించడంలో కొంత ఆలస్యం జరిగింది. అప్పట్లో మెడికోలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మెడికోలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయడంతో శాంతించారు. కాగా రిమ్స్ హాస్టల్ వైపు 38 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వాటిలో కొన్ని పనిచేయడం లేదు. ఎన్ఎంసీ కోసం 26, రిమ్స్ ఓపీ విభాగంలో 28, ఇన్‌పేషెంట్ విభాగంలో 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ కొంత కాలంగా అవి పనిచేయడం లేదు.

కోల్‌కతా ఘటనపై నిరసన..

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్యకు సంబంధించి బుధవారం రిమ్స్‌లో మెడికోలు నిరసన చేపట్టారు. విధులు బహిష్కరించి రిమ్స్ డైరెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. కలకత్తాలో సంఘటన జరిగిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రిమ్స్‌లో పోలీసులతో ప్రత్యేక భద్రత కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, మౌనిక, అన్వేష్, కార్తీక్, ప్రసన్న, ప్రత్యూష, నందీశ్వర్, కారుణ్య, తదితరులు పాల్గొన్నారు.

పోకిరీల వేధింపులు

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థినులకు పోకిరీల నుంచి వేధింపులు తప్పడంలేదు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో రెండేళ్ల క్రితం ప్రారంభించిన మెడికల్ కళాశాలకు సమీపంలోనే అమ్మాయిలు, అబ్బాయిలకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. కళాశాల నుంచి హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో పోకిరీలు బైక్‌లపై వేగంగా వస్తూ, హారన్ మోగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాలేజీ ఆవరణలోనే విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించాల్సి ఉండగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో ఆ సదుపాయం లేకపోవడంతో సమీపంలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌ను అద్దెకు తీసుకుని అందులో హాస్టల్ నిర్వహిస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినుల నుంచి డిమాండ్ ఉంది.

రిమ్స్‌లో చోటు చేసుకున్న ఘటనలు..

- గతేడాది రిమ్స్ వసతిగృహంలో ఉండే మెడికోలపై నలుగురు బయటి వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. వైద్య విద్యార్థులను వాహనంతో ఢీకొట్టేందుకు యత్నించినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.
- గతేడాది బాలికల వసతిగృహం వెనుక వైపు నుంచి పైపు సహాయంతో కొందరు వ్యక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించారు. గమనించిన మెడికోలు కేకలు వేయడంతో పరారయ్యారు.
- పక్షం రోజుల క్రితం రిమ్స్ న్యూ క్వార్టర్స్‌లో చెత్త ఏరుకునేవారు మహిళా పీజీలు ఉండే రూమ్ తలుపు తట్టడంతో భయాందోళనకు గురయ్యారు. బయటకు వచ్చి చూసే సరికి వారు పరారయ్యారు.
- గత నెలలో గైనిక్ వార్డులో మహారాష్ట్రకు చెందిన బాలింత వెంబడి వచ్చిన సహాయకురాలు పీజీ వైద్యురాలితో వాగ్వివాదానికి దిగి ఆమెపై చేయి చేసుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్ చేశారు.
- గత నెల ఓ పీజీ వైద్యుడు రిమ్స్‌లో చదివే మెడికోను తన వాహనంలో ఎక్కించుకుని కలెక్టర్ చౌక్‌లో ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు తండ్రితో కలిసి టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది.
- రిమ్స్ వసతిగృహంతో పాటు ఆయా వార్డుల్లోని సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు, ఆటోలు, ఇతర వస్తువులను దొంగలు దోచుకెళ్తున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. సెక్యూరిటీ గార్డులు ఉన్నప్పటికీ ఇలాంటివి చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

భద్రత కల్పించాలి



రిమ్స్‌లో తరచూ ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటోంది. సెంట్రల్ ఫోర్స్‌తో ప్రత్యేక భద్రత కల్పించాలి. బయటి వ్యక్తులు హాస్టల్‌లోకి చొరబడి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రిమ్స్ ప్రధాన గేటు ఎదుట కొందరు వ్యక్తులు మద్యం మత్తులో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అక్కడ ఫుట్‌పాత్ వద్ద ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించాలి.

– మౌనిక, పీజీ విద్యార్థిని, ఆదిలాబాద్

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



కాలేజీలో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఏం జరుగుతుందో పరిశీలిస్తున్నాం. కాలేజీ, హాస్టల్ రెండు వేర్వేరుగా ఉండడంతో విద్యార్థులు నడిచి వెళ్తున్నారు. బస్సు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. బస్సు కేటాయిస్తే వారికి మరింత రక్షణ ఉంటుంది. విద్యార్థినులు వెళ్లే సమయంలో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

– ఎండీ సులేమాన్, మంచిర్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం..



రిమ్స్‌లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గతేడాది జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ చుట్టూ, ముందు భాగంలో 38 సీసీ కెమెరాలు అమర్చాం. ప్రతీరోజు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. బయటి వ్యక్తులు హాస్టల్‌లోనికి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నాం. మూడు షిఫ్టుల్లో ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులను నియమించాం. రిమ్స్‌లో ప్రత్యేక భద్రత కల్పించాలని పోలీసు అధికారులకు విన్నవించాం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం..!



దేవయ్య మృతదేహం

లక్సెట్టిపేట: పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్ సమీపంలో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఎస్సై పీ.సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం సబ్బెపల్లి గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి చింతల దేవయ్య (37) తన వ్యాపారం నిమిత్తం రోజూ లక్సెట్టిపేటకు వస్తుంటాడు. మంగళవారం రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో దేవయ్య మృతి చెందినట్లు పరిసర ప్రాంతాల వారు మృతుని భార్య రాజేశ్వరికి సమాచారం అందించడంతో అక్కడికి వెళ్లి బోరున విలపించింది. మృతుడు సబ్బెపల్లి గ్రామానికి చెందిన వివాహితతో కొంతకాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. పలుమార్లు మందలించినా వినకపోవడంతో సదరు మహిళ భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయినా అక్రమ సంబంధం కొనసాగిస్తుండడంతో మహిళ భర్త సోదరులు సత్తయ్య, అంజయ్య, మరికొందరితో కలిసి పథకం ప్రకారం బలమైన ఆయుధంతో తలపై కొట్టి హత్య చేసినట్లు రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు.

అతిగా మద్యం సేవించి వలస కూలీ మృతి

మంచిర్యాలక్రైం: అతిగా మద్యం సేవించి వలస కూలీ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దివాకర్ తెలిపిన వివరాల మేరకు బల్లార్షాలోని కన్నంబరివాడకు చెందిన ఏట కైలాస్‌రెడ్డి (40) కొద్దిరోజుల క్రితం మంచిర్యాలకు వలసవచ్చి పెయింటింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం అతిగా మద్యం సేవించి ముఖరాం చౌరస్తా సమీపంలో సెల్ పాయింట్ ఎదుట మృతి చెందాడు. బుధవారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

దుప్పిమాంసం కలిగి ఉన్న ఐదుగురిపై కేసు



నిందితులతో అటవీరేంజ్ అధికారులు

బెల్లంపల్లి: ఇంట్లో దుప్పి మాంసం కలిగి ఉన్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి అటవీ రేంజ్ అధికారి పూర్ణచందర్ తెలిపారు. బుధవారం రేంజ్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు బెల్లంపల్లి మండలం పెర్కపల్లిలో అనుమానితుల ఇళ్లను సోదా చేయగా దుప్పిమాంసం లభించడంతో స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సింగతి శ్రీకాంత్, పెద్ది రాజశేఖర్, సింగతి శ్రీనివాస్, కళ్యాణం మల్లేశ్, చింతం జీవన్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులకు రూ.2 లక్షల జరిమానా విధించినట్లు వివరించారు. ఈ తనిఖీల్లో అటవీ రేంజ్ సిబ్బంది సతీష్‌కుమార్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ పట్వర్ధన్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అధ్యాపకులు

చెన్నూర్‌రూరల్: కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎఫ్ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.వి పట్వర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన శ్రీదేవి కాగజ్‌నగర్‌కు బదిలీపై వెళ్లగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న చెన్నూర్ వాస్తవ్యుడైన పట్వర్ధన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

నిరుపేదకు దాతలసాయం



కృతజ్ఞతలు తెలుపుతున్న కిరణ్ దంపతులు

చెన్నూర్: 'నిరుపేదకు పెద్ద ఆపద' శీర్షికన ఈ నెల 13న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు బుధవారం కిరణ్‌కు ఫోన్‌పే ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించేందుకు కృషి చేస్తామని ఆరోగ్యశ్రీ మంచిర్యాల జిల్లా టీం లీడర్ తాళ్లపల్లి రాకేశ్ భరోసా ఇచ్చారు. దాతలు, 'సాక్షి'కి కిరణ్ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..